క్లుప్తంగా

వెంకట్‌రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



వెంకట్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బూడిద వెంకట్‌రెడ్డి(90) కుటుంబాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి కన్నుమూసిన తెలిసిందే. వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రాంరెడ్డి, రాష్ట్ర లారీ అసోసియేషన్ అధ్యక్షులు నందారెడ్డి ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుర్కగూడకు చెందిన తరణ్‌కు ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. లక్ష ఎల్‌ఓసీని మంజూరు చేయించి ఆ పత్రాన్ని బాధిత కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కుమార్, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సునీల్‌గౌడ్‌కు సన్మానం



సునీల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

కడ్తాల్: కడ్తాల్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుమారుడు సునీల్‌గౌడ్ ఇటీవల వెలువడిన ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సునీల్‌గౌడ్‌తో పాటు, ఆయన తల్లిదండ్రులను సన్మానించారు. సునీల్‌గౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గణేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, శ్రీకాంత్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాంపాల్‌నాయక్, యాదమ్మ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ తెలిపారు. 11వ వార్డులోని ఆదర్శనగర్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, కౌన్సిలర్ యాదమ్మలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ యాదమ్మలు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హరిప్రసాద్, కౌన్సిలర్లు చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, కృష్ణయాదవ్, విక్రంరెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో సీసీరోడ్లు నిర్మించాలి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన

తలకొండపల్లి: దళితవాడల్లో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు, మురుగు కాల్వలు నిర్మించాలని ఎమార్పీస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీరోడ్లు లేక దళితులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు కిరణ్‌పూలే, ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఇన్‌చార్జి శ్రీకాంత్, రమేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు

ఇబ్రహీంపట్నం: టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఇబ్రహీంపట్నం డిపో వద్ద కార్మికులు సోమవారం సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వంలో విలీనం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బిల్లును ఆమోదించి సహకరించిన గవర్నర్ తమిళిసైకి కృతజ్ఞతలు తెలిపారు. బాణాసంచాలు కాలుస్తూ, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు, కార్మికులు తదితరులున్నారు.

గద్దర్ జ్ఞాపకాల కన్నీటి తడి

జనం గుండెల చప్పుడై గళం ఎత్తిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అస్తమించారు. ఆయన పాట, మాట దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. రచయితగా కవిగా, గాయకుడిగా, వాగ్గేయకారుడిగా ఒక చరిత్ర సృష్టించారు గద్దర్. దేశమంతా ఆయన పాటయ్యాడు. ఉద్యమాలు, ఆందోళనల్లో కదంతొక్కిన ఆ పాదాలు ఆగిపోయాయి. అణగారిన వర్గాలకు బాసటగా నిలిచిన గద్దర్ అని పిలువబడే గుమ్మడి విఠల్‌రావు ప్రస్థానం ముగిసింది. గద్దర్‌కే తప్పా ఆయన పాటకు మరణం లేదు.

- గద్దర్‌కు తుది వీడ్కోలు
- ఆయన పోరాట స్ఫూర్తి గొప్పది
- పాటలతో చైతన్యాన్ని నింపిన కళాకారుడు
- ప్రజాప్రతినిధులు, నేతల నివాళి



గట్టుఇప్పలపల్లి: గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: ప్రజా యుద్ధనౌకగా పేరు గాంచిన గద్దర్ పోరాట స్ఫూర్తి గొప్పదని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. ఆయన మృతి అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. సోమవారం కడ్తాల్‌లో యువజన సంఘాల ఐక్యవేదిక-వివేకనంద యువజన సంఘం ఆధ్వర్యంలో గద్దర్ మృతికి సంతాపం తెలిపి.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గద్దర్ జ్ఞాపకాల కన్నీటి తడి అని ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రజలు మర్చిపోరని చెప్పారు. ఆయన భౌతికంగా లేక పోయిన, ఆయన పాట శాశ్వతంగా బతికే ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా బీసీ సంఘం నాయకులు చందోజీ, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు వాణిశ్రీ, నాయకులు లక్ష్మీనారాయణ, కృష్ణ, యాదగిరి, భగీరథ, మల్లయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విప్లవజ్యోతి గద్దర్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో ప్రజాసంఘాలు, కార్మిక, కర్షక, రైతుసంఘాల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, యుద్ధనౌక గద్దర్‌కు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమం



ఆమనగల్లు: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

గద్దర్ కీలక పాత్ర పోషించారని నేతలు తెలిపారు. ఆయన సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. బలహీనవర్గాల విప్లవ జ్యోతి గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, రేణురెడ్డి, బాలకృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు.. అమృతపు జల్లు

ఎంపీపీ సుకన్య

యాచారం: శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని, రెండేళ్ల పాటు చిన్నారులకు తల్లి పాలు పడితే ఆ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం యాచారం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గర్భిణీలు, బాలింతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పుట్టిన బిడ్డకు వెంటనే పాలు పట్టించాలని సూచించారు. మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణీలు, బాలింతలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్యాధికారి రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది అంజమ్మ, లక్ష్మి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

తహసీల్దార్‌కు సన్మానం

యాచారం తహసీల్దార్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని సోమవారం ఎంపీపీ చాంబరులో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్‌ను సన్మానించినవారిలో ఎంపీపీ సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఐక్యత ఫౌండేషన్ సేవలు అభినందనీయం

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్

కడ్తాల్: ఆపదలో ఉన్న వారికి ఐక్యత ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. యాదయ్య కుటుంబానికి, ముద్వీన్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన భారతమ్మ కుటుంబానికి చెరో రూ.5 వేలను ఐక్యత ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, మధుగౌడ్, బాలరాజు, వెంకటేశ్, రమేశ్‌నాయక్, శ్రీను, వీరేశ్, రాములు, స్వామిగౌడ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రవికాంత్‌గౌడ్

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

కడ్తాల్: కడ్తాల్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం నాయకులు కేక్‌కట్ చేసి జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకున్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సాహించాలని, నేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. పద్మశాలీయుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు అంజయ్య, యాదయ్య, శేఖర్, భూపాల్, శ్రీరాములు, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్, చంద్రప్రకాశ్, రాఘవేందర్, రాఘవ్, గిరి ఉన్నారు.

మన్నెగూడకు తరలిన చేనేత కార్మికులు

ఆమనగల్లు: జిల్లాలోని మన్నెగూడలోని సార్థ ఫంక్షన్‌హాలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఆమనగల్లు పట్టణం నుంచి సోమవారం పలువురు నాయకులు, చేనేత కార్మికులు తరలివెళ్లారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసింది. పట్టణానికి చెందిన నాయకులు, చేనేత కార్మికులు ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మన్నెగూడకు తరలివెళ్లారు. వేడుకలకు వెళ్లిన వారిలో చేనేత సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ ఉన్నారు.



కడ్తాల్: కేక్‌కట్ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

రోడ్డెక్కిన పంచాయతీ కార్మికులు

- సాగర్ రహదారిపై రాస్తారోకో
- 33వ రోజుకు చేరిన సమ్మె
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం రోడ్డెక్కారు. ఇబ్రహీంపట్నంలో ర్యాలీని నిర్వహించి నాగార్జుసాగర్ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనను దిగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు బుగ్గ రాములు మాట్లాడుతూ 33 రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మెకు నిరెత్తినట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సంఘం నాయకులు దేవదాసు, భాస్కర్, సురేశ్, ఖాజాపాష, రవి, జంగయ్య, శంకరయ్య, సుశీల, పోచమ్మ, రాణమ్మలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కడ్తాల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, కారోబార్, బిల్‌కలెక్టర్, డ్రైవర్లకు రూ.19500 వేతనం ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, యాదగిరి, వెంకటేశ్, మహేశ్, లక్ష్మీనారాయణ, మల్లయ్య పంచాయతీ కార్మికులు ఉన్నారు.



కడ్తాల్: జీపీ కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న రాఘవేందర్ తదితరులు

33వ రోజుకు చేరిన సమ్మె

యాచారం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సోమవారానికి 33వ రోజుకు చేరింది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది శాంతియుతంగా సమ్మె చేస్తూ.. సీఎం కేసీఆర్ మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకున్నారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ పాల్గొన్నారు.



యాచారంలో సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులకు నెలకు కనీసం రూ. 19,500 వేతనం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం పంచాయతీ కార్మికులు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ ఎదుట బైఠాయించి సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, 10 లక్షల ప్రమాదబీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు యాదమ్మ, జంగయ్య, చెన్నయ్య, సుగుణమ్మ, రాములు, రవలి, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కలవడానికి వెళ్తున్నారనే సమాచారంతో ఏఎన్‌ఎంలను ఆదిబట్ల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఏఎన్‌ఎంలు నిరసన తెలిపారు. 16 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు. కేటీఆర్ సమావేశం అనంతరం సొంత పూచికత్తుతో విడిచిపెట్టారు.

ఏఎన్‌ఎంల అరెస్ట్ అప్రజాస్వామికం

తుర్కయంజాల్: ఏఎన్‌ఎంల అరెస్ట్ అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య విమర్శించారు. కొన్నేళ్లుగా రెగ్యూలరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించిన ఏఎన్‌ఎంల అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు.



ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు, ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం పెద్ద అంబర్‌పేట్‌లోని రావి నారాయణరెడ్డి కాలనీలో సీపీఐ నాయకులు ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ విధానాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శేఖర్‌రెడ్డి, హరిసింగ్ నాయక్, శ్రీనివాస్ సాగర్, నారాయణ, కాశీం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

- ఏడాదిన్నర తర్వాత ప్రజాసమస్యలపై కొనసాగిన చర్చ!
- కొత్త కమిషనర్ రవీంద్రసాగర్‌కు తొలి సమీక్ష

ఇబ్రహీంపట్నం: ఊహించని విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం ప్రశాంతంగా జరిగింది. చైర్‌పర్సన్, పలువురి కౌన్సిల్ సభ్యుల మధ్య ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో సమీక్షకు ఆటంకం కలిగేది. కొన్ని సమావేశాలకు అప్పటి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరైనా ఫలితం లేకుండా పోయేది. సమావేశం జరిగినప్పుడల్లా పోలీసులు రావాల్సిన పరిస్థితి ఉండేది. ఏడాదిన్నర పాటు సక్రమంగా సాగని సమావేశాలు.. కమిషనర్ యూసుఫ్ బదిలీపై వెళ్లడం, ఆయన స్థానంలో రవీంద్రసాగర్ బాధ్యతలు చేపట్టిన తరువాత నిర్వహించిన తొలి కౌన్సిల్ సమావేశం సాఫీగా సాగింది. సభ్యులు ఐక్యతగా ఉంటూ ప్రజా సమస్యలపై చర్చించారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చ కొనసాగింది. బోనాల ఉత్సవాలు, పంద్రాగస్టు వేడుకలు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అభివృద్ధి పనులపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీంద్రసాగర్ తదితరులు

ఆమనగల్లు తహసీల్దార్‌గా లలిత

ఆమనగల్లు: ఆమనగల్లు మండల తహసీల్దార్‌గా సోమవారం సీహెచ్ లలిత బాధ్యతలు చేపట్టారు. ఆమనగల్లు తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతి హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్‌లో పనిచేస్తున్న గిరిజను ఆమనగల్లు తహసీల్దార్‌గా నియమించిన విషయం తెలిసిందే. అయితే ఆమనగల్లు రావడానికి గిరిజ విముఖత చూపడంతో లలితను ఆమనగల్లుకు బదిలీచేశారు.

డాక్టర్ అబ్బయ్యకు సన్మానం

ఇబ్రహీంపట్నం: గాంధీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ అబ్బయ్యను రాష్ట్ర డయాగ్నోస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుడిగా అబ్బయ్య ఎంతో మందికి వైద్య సేవలను అందించారన్నారు. ఆయన గాంధీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు తీసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రవిచంద్ర, సురేష్, సత్యం, విక్రం, దశరథ్ పాల్గొన్నారు.

ఆ మూడెకరాలు పేదలకు చెందాలి

తుర్కయంజాల్: పోల్కంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 176లోని 3 ఎకరాల భూమిని ప్రజలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోడ సామెల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామెల్ మాట్లాడారు. గతంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటం ఫలితంగా 60 ఎకరాల భూమిని పేద ప్రజలకు పంపిణీ చేశారని, మిగిలిన 3 ఎకరాల భూమిని నాటి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేరంగుల నరసింహతో రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. ఆ భూమిని నరసింహ తన కుమారుడు రాజు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సదరు భూమిని గ్రామంలోని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 19 మద్యం దుకాణాలకు 2023–23కు గాను దరఖాస్తులు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీఐ మాట్లాడుతూ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్సీ–01, గీతకార్మికులకు– 03, ఇతరకులకు–15 కేటాయించామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు బండ్లగూడ జాగీర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అకాడమీ వద్ద, నాంపల్లి అబ్కారీ కార్యాలయంలోని 4వ అంతస్తులో, సరూర్‌నగర్ అబ్కారి అధికారి కార్యాలయం నందు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రూ.2 లక్షలు చలాన్, డీడీ జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి సరూర్‌నగర్ రంగారెడ్డి జిల్లా పేరు మీద తీయాలని సూచించారు. 3 పాస్ పోటోలు, ఆధార్, పాన్‌కార్డు జీరాక్స్, తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని చెప్పారు. దరఖాస్తుదారులపై ఎలాంటి ఎక్సైజ్ కేసులు ఉండరాదన్నారు.



వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి

సామూహిక సీమంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పెద్ద అంబర్‌పేట పట్టణ కేంద్రంలోని 7వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ కృష్ణారెడ్డి గర్భిణీలకు చీరలు, గాజులు, పండ్లు అందజేశారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు గర్భిణీలు వైద్యుల సూచనలు తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు తప్పనిసరిగా తాగించాలని వైద్య సిబ్బంది సూచించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లి పాలు తాగిస్తే రోగ నిరోధక శక్త పెరగుతుందన్నాను. ముర్రుపాలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష.. స్పందించని ప్రభుత్వం

జేఏసీ నాయకుడు రేణురెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకుడు రేణురెడ్డి స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రేణురెడ్డి మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులన్నీ ఉన్నాయన్నారు. 36 రోజులుగా దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం స్పదించడం లేదన్నారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివయ్య, బాలస్వామి, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, రాజు, దామోదర్, డేవిడ్, శ్రీను, యాదయ్య, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు తదితరులు

గట్టుఇప్పలపల్లి మండలమయ్యేనా?

గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చిన్న చిన్న గ్రామాలు మండలాలుగా ఏర్పాటవుతున్నాయని గుర్తుచేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గుడిపల్లికి ఓ న్యాయం, గట్టుఇప్పలపల్లికి మరో న్యాయమా అని ప్రశ్నించారు.